క్లుప్తంగా

నేడు రెవెన్యూ దినోత్సవం

సామర్లకోట: రెవెన్యూ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రెవెన్యూ శాఖలో పని చేసిన విశ్రాంత సీనియర్ ఉద్యోగులను, 75 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లను తహసీల్దార్ కార్యాలయంలో సత్కరిస్తామని చెప్పారు. రెవెన్యూ సేవలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో బేతాళ స్వామి ఉత్సవం


బేతాళ స్వామివారు

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలో ఉన్న బేతాళ స్వామి ఉత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. బేతాళ స్వామి ఆలయం నిర్మించి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షిక వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక

పెద్దాపురం: మండలంలోని దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ అల్యూమినియం కంపెనీ ఈ సెలెక్షన్స్ నిర్వహించిందన్నారు. తమ కళాశాలకు చెందిన 20 మందితో పాటు, ఇతర కళాశాలల విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన వారిని చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రెడ్డి అభినందించారు.

వాకతిప్పలో కార్మికుల సర్వే


వాకతిప్పలో సర్వే నిర్వహిస్తున్న నాయకులు

కొత్తపల్లి: సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని వాకతిప్పలో శనివారం ఇంటింటికీ తిరిగి కార్మికుల సర్వే నిర్వహించారు. సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షులు బేబీరాణీ, సీహెచ్ పద్మ సర్వేను పరిశీలించారు. కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, కార్యదర్శి కేవీవీ సత్యన్నారాయణ, నాయకులు జి.అప్పారెడ్డి, జీవీఎస్ రెడ్డి, వాసు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రేపాకకు సత్కారం


వెంకట దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న ఈఓ తదితరులు

సామర్లకోట: ఆంధ్ర ధార్మిక సామాజిక పరిషత్తు రాష్ట్ర కార్యదర్శి రేపాక వెంకటదుర్గవరప్రసాద్‌ను స్థానిక పంచారామ క్షేత్రంలో శనివారం సత్కరించారు. గత నెల 22 నుంచి శనివారం వరకు ఆలయానికి వచ్చే భక్తులకు, సిబ్బందికి యోగాపై శిక్షణ ఇచ్చిన ఆయనను సత్కరించినట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

వృథా పోతున్న తాగునీరు


నాగులాపల్లి-పొన్నాడ రోడ్డులో బ్రిడ్జి వద్ద వృథా పోతున్న తాగునీరు

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లి-పొన్నాడ రోడ్డులో ఉప్పుటేరు వంతెన సమీపంలో తాగునీరు వృథా పోతోంది. ఇటీవల వేసిన పైపులైను నాణ్యతగా లేకపోవడంతో జాయింట్ వద్ద సమస్య ఏర్పడింది. కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వృథాగా పోతున్న తాగునీటిని సరిచేయాలని కోరుతున్నారు.

రిపేరు లేని జీవితాలు

- ప్రోత్సాహం కరవైన మెకానిక్‌లు
- మరుగున పడే స్థితిలో మెకానిక్ షాపులు
- హెల్పర్లు దొరక్క ఇబ్బందులు
- వృద్ధాప్యంతో పని చేయలేని దుస్థితి


మోటార్ సైకిల్ రిపేర్ చేస్తున్న మెకానిక్

సామర్లకోట: రోజురోజుకూ మోటార్ సైకిళ్ల వాడకం పెరుగుతుండగా.. వాటికి మరమ్మతులు చేసే మెకానిక్‌ల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. రెండు దశాబ్దాల క్రితం మోటార్ సైకిళ్ల మెకానిక్‌లకు మంచి డిమాండ్ ఉండేది. దాంతో ఆర్థికంగా వెనుకబడిన వారు తమ పిల్లలను మోటార్ సైకిలు మెకానిక్ వృత్తికి పంపేవారు. వారికి 20 ఏళ్లు వచ్చే నాటికి మంచి మెకానిక్‌గా తయారయ్యేవారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను కఠినంగా అమలు చేయడంతో.. మెకానిక్ షాపుల్లో తక్కువ వయసు వారిని పెట్టుకోవడానికి భయపడుతున్నారు. దీనికితోడు మెకానిక్ వృత్తిలోకి పిల్లలను పంపడానికి తల్లిదండ్రుల్లో ఆసక్తి తగ్గడం, ప్రభుత్వ స్కూళ్లలోనూ మంచి చదువు అందుబాటులో ఉండడం తదితర కారణాలతో ఈ వృత్తికి ఆదరణ తగ్గింది. ఈ నేపథ్యంలోనే అందుబాటులో ఉన్న మెకానిక్‌లే షాపులను నిర్వహిస్తున్నారు.

చేతనైనంత వరకు..

మండలంలో సుమారు 70 మోటార్ సైకిలు మెకానిక్ షాపులున్నాయి. వీటిలో 20 షాపుల్లో మాత్రమే హెల్పర్లు ఉన్నారు. మిగిలిన షాపుల్లో యజమానులే అన్ని పనులు చేసుకుంటున్నారు. ఈ 50 మందిలోను 30 మంది వరకు 50 ఏళ్లు దాటిన వారే అధికంగా ఉన్నారు. కొంతమంది 60 ఏళ్లు పైబడినా.. మరో వృత్తికి వెళ్లలేక చేతనైనంత పనులు చేసుకుంటున్నారు. మోటార్ సైకిలు మెకానిక్‌లంటే పలు రకాలుగా శారీరక శ్రమతో పనులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం 60 ఏళ్లు దాటిన వారు ఆ మేరకు మెకానిక్ పనులు చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు.

మూతపడితే..

మోటార్ సైకిలు మెకానిక్ వృత్తిని నేర్చుకునే వారు కానరాకపోవడంతో.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న షాపులు మూతపడితే, ఆయా మోటార్ సైకిళ్ల సర్వీసు సెంటర్లకే వెళ్లి మరమ్మతులు చేయించుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. బాల కార్మిక నిర్మూలన వ్యవస్థ కారణంగా మెకానిక్ పనులు నేర్చుకోవాలని కొందరు ఆసక్తి చూపుతున్నా, నేర్పలేకపోతున్నామని మెకానిక్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 ఏళ్లు దాటిన వారికి పని చెప్పినా.. పెడచెవిన పెట్టడంతో వృత్తిలో రాణించలేకపోతున్నారని అంటున్నారు. కొంత కాలానికి మోటార్ సైకిళ్లను నిర్ణీత కాలపరిమితి దాటితే మూలన పడవేయాల్సిన పరిస్థితులు రావచ్చని విశ్లేషిస్తున్నారు.

వృత్తి శిక్షణ ఇవ్వాలి



ఇప్పటికే గృహ నిర్మాణ రంగంలో అనేక మందికి వృత్తి శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా మోటార్ సైకిళ్ల రిపేరింగ్‌లో ప్రత్యేకంగా వృత్తి శిక్షణ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సులో దీనిపై ప్రత్యేక కోర్సును ఏర్పాటు చేయాలి. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేర్చుకునే అవకాశం ఉంటుంది. సర్టిఫికెట్ల ఆధారంగా ఆయా మోటార్ సైకిళ్ల కంపెనీల్లో ఉపాధి పొందే వీలుంటుంది. ఆసక్తి ఉన్నవారు బ్యాంకు రుణాలతో షాపులు ఏర్పాటు చేసుకుంటారు.

– స్వయంభారవు వీరభద్రరావు, కౌన్సిలర్, సామర్లకోట

హెల్పర్లు లేకపోతే కష్టం



గత 30 ఏళ్లుగా మోటార్ సైకిలు మెకానిక్‌గా పని చేస్తున్నాను. మోటార్ సైకిళ్ల రిపేరింగ్ షాపుల్లో హెల్పర్లు లేకపోతే దుకాణాల నిర్వహణ కష్టంగా ఉంటుంది. గతంలో అనేక మంది మోటార్ సైకిలు రిపేరింగ్ నేర్చుకోవడానికి వచ్చేవారు. బాల కార్మికుల పేరుతో అనేక మందిపై కేసులు పెట్టారు. ఇప్పటికీ అనేక మంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. 60 ఏళ్లు దాటితే మోటార్ సైకిలు రిపేర్లు చేయలేం.

– గల్లా సూర్యప్రకాష్, మోటార్ సైకిల్ మెకానిక్, సామర్లకోట

రేపు ఒలింపిక్ రన్

సామర్లకోట: ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 8 గంటలకు ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తాళ్లూరి వైకుంఠం, కొండపల్లి శ్రీనివాసు తెలిపారు. స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి మఠం సెంటర్ వరకు రన్ జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: పట్టణంలోని సత్యనారాయణపురం జయలక్ష్మి థియేటర్ రోడ్డులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విన్నకోట సురేష్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఉదయం 6 గంటల నుంచి ఎటువంటి ఆహారం తీసుకోకుండా రావాలని చెప్పారు. ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు.

స్కూల్ బ్యాగ్‌ల పరిశీలన


బ్యాగ్‌లను పరిశీలిస్తున్న సీఎంఓ

సామర్లకోట: మండలంలోని విద్యార్థుల కోసం కేటాయించిన స్కూల్ బ్యాగ్‌లను సీఎంఓ చామంతి నాగేశ్వరరావు పరిశీలించారు. విద్యార్థుల కోసం వచ్చిన స్టూడెంట్ కిట్లను బ్రౌన్‌పేటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం పరిశీలించారు. విద్యార్థుల బూట్లు, బ్యాగ్‌లను సీఎంఓ పరిశీలించారు. ప్రతి బ్యాగ్‌కు కోడ్ నంబరు ఇచ్చారని, దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఏ విద్యార్థికి ఇచ్చారో తెలుస్తుందన్నారు. ఇప్పటికే పాఠ్య, నోట్ పుస్తకాలు విడుదల కావడంతో, సోమవారం బ్యాగ్‌లు, బూట్లు ప్రతి పాఠశాలకు చేరేలా చూడాలన్నారు. మండలంలోని పాఠశాలలు, విద్యార్థుల వివరాలను ఎంఈఓ-2 పి.పుల్లయ్య తెలిపారు.

మూలపేటలో స్థల వివాదం

కొత్తపల్లి: ప్రభుత్వ స్థలానికి చేపట్టిన సర్వే వివాదాస్పదంగా మారింది. ఓ వర్గం వారు సర్వేయర్‌ను అడ్డుకోవడాన్ని మరో వర్గం అభ్యంతరం తెలిపింది. దీంతో తహసీల్దార్ ఈ విషయమై నిర్ణయం తీసుకోవాలని ఇరు వర్గాలు భీష్మించాయి. వివరాల్లోకి వెళితే, మండలంలోని మూలపేట ప్రకాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలం విషయంలో శుక్రవారం పట్టుశాలి, రజక వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ప్రకాష్‌నగర్‌లోని 62/1ఎలో సుమారు 25 సెంట్ల భూమి ఉంది. దీనికి సర్వే చేసి అప్పగించాని రజకులు అధికారులకు విన్నవించారు. ఈ క్రమంలో శుక్రవారం సర్వేయర్ అక్కడకు చేరుకున్నారు. ఈ స్థలాన్ని ఆక్రమించారని, ఖాళీ చేసి తమకు అప్పగించాలని పట్టుశాలి వర్గీయులు సర్వే జరగకుండా అడ్డుకున్నారు. దీంతో ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళతామని సర్వేయర్ స్పష్టం చేశారు. వేరే విధుల్లో ఉన్న తహసీల్దార్ వచ్చే వరకు వేచిచూడాలంటూ సర్వే చేయకుండానే వెనుదిరిగారు.

గత ఏడాది తల్లికి వందనం ఏమైంది..?

- కూటమి మోసాలపై నిరసనను విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్


సమావేశంలో మాట్లాడుతున్న వంగా గీత

పిఠాపురం: ప్రజలు తిరుగుబాటు చేస్తుంటే ఇప్పుడు హడావిడిగా తల్లికి వందనం వేస్తున్నామంటూ చెబుతున్న కూటమి నేతలు.. గతేడాది తల్లికి వందనం ఏమైందో సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ డిమాండ్ చేశారు. పిఠాపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నమ్మి ఓట్లు వేస్తే, అధికారంలోకి వచ్చాక నట్టేట ముంచారంటూ కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, వారికి అండగా ఉండి పార్టీ తరఫున ప్రజలతో కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాలయాల యజమానులు, నిరుద్యోగులతో కలిసి సోమవారం జిల్లా కేంద్రాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేడర్‌కు సూచించారు. ఏర్పాట్లపై సమీక్షించి, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ మోసాలను కూటమి నేతల వెన్నుపోటును ప్రజలు ఎండగడుతున్నారన్నారు. ఏడాది కాలంలో ఏం సాధించారని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారంటూ కూటమి నేతలను ప్రశ్నించారు. రైతు కుటుంబాలకు ఎటువంటి పథకాలూ అందలేదన్నారు. విద్యార్థులు వృద్ధులు, మహిళలు మొత్తం ప్రజల ఆందోళనను పట్టించుకోని కూటమి నేతలు మాత్రం ఆనందంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఫ్యామిలీ వైద్యం, ప్రభుత్వాస్పత్రులు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విద్యా పథకాలు, ప్రభుత్వ పాఠశాలలు ఇలా అన్ని వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఎండీయూ వాహనాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో నీకు 15, నీకు 15 అంటూ నమ్మించి మోసం చేశారని, లక్షల ఉద్యోగాలు లేవు, నిరుద్యోగ భృతీ లేదు, ఉన్న ఉద్యోగాలూ తీసేస్తున్నారని దుయ్యబట్టారు. ఇదంతా ప్రజలకు ప్రభుత్వ పరిపాలన దూరం చేయడమేనన్నారు. తక్షణం హామీలన్నీ అమలు చేయాలని, లేకపోతే ప్రజలు ప్రారంభించిన ఉద్యమం మరింత తీవ్రతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి ఉలవల భూషణం, నియోజకవర్గ అధ్యక్షుడు దాసం వెంకటేష్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, నాయకులు అరిగెల రామయ్యదొర, తలిశెట్టి వెంకటేశ్వరరావు, మొగలి అయ్యారావు, ముమ్మిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో మహిళలకు ప్రత్యేక స్థానం


సోమరౌతు లలితను సత్కరిస్తున్న నేతలు

పిఠాపురం: మహిళలకు వైఎస్సార్ సీపీలో ప్రత్యేక స్థానం ఉందని, ఇంతటి ప్రాధాన్యం మరే పార్టీలోను ఉండదని వంగా గీతా విశ్వనాథ్ అన్నారు.

పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. నూతనంగా నియమితులైన పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు సోమరౌతు లలిత, ఇతర మహిళా నాయకులు శనివారం పార్టీ పట్టణ కార్యాలయంలో ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వివిధ విభాగాల్లో నిష్ణాతులైన కార్యకర్తలు, నాయకులను అధ్యక్షులుగా నియమించడం ద్వారా పార్టీపై నాయకుల్లో విశ్వాసం పెంచినట్లైందన్నారు. ప్రతి ఒక్కరూ తమకిచ్చిన పదవులతో నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపించి, ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలన్నారు. పార్టీ సూచించిన కార్యక్రమాల్లో ప్రజల తరఫున పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తమపై పార్టీ పెట్టిన గురుతర బాధ్యతను శక్తివంచన లేకుండా పని చేసి, పార్టీని మరింత బలోపేతం చేస్తామని నూతనంగా నియమితులైన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఐతే శోభ, పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పొదుపు చేయాలి


జీజీహెచ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

కాకినాడ క్రైం: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లో పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంతో పాటు నీరు-మీరు కార్యక్రమం నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ, భవిష్యత్ తరాల భద్రత కోసం భూగర్భ జలాలు పొదుపు చేయాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అలాగే కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జల, వన సంరక్షణ పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


శిక్షణ కేంద్ర ఆవరణను శుభ్రం చేస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

సామర్లకోట: శారీరక ఆరోగ్యానికి పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం విస్తరణ శిక్షణా కేంద్రంలోని ఆవరణను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించేలా చూడాలన్నారు. అంతకుముందు యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శిక్షణా కేంద్రంలోని సిబ్బందితో యోగాసనాలు వేయించి, యోగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణ, ఫ్యాకల్టీలు కె.సునీల, బి.ఆంజనేయులు, ఎం.చక్రపాణిరావు, ఎ.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ నిర్మూలనకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ప్రతి ఇంటి వద్ద రెండు మొక్కలు నాటేలా తల్లిదండ్రుల్లో విద్యార్థులు అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.గంగా భవాని, బీఆర్ఎస్ శివకుమార్, టీఎస్ పద్మావతి, ఎస్ హరినాథ్, మహ్మద్ సైదున్నీసా బేగం, ఎం శిరీష, ప్రశాంతి, బాలశైలజ, పీడీ పి.సుధారాణి పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి యోగా దివ్యౌషధం


సామర్లకోట జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేసిన కమిషనర్, చైర్‌పర్సన్ తదితరులు

సామర్లకోట: శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా దోహద పడుతుందని మున్సిపల్ కమిషనర్ అనుసూరి శ్రీవిద్య అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువులతో యోగాసనాలు వేయించారు. సీఐ ఎ.కృష్ణభగవాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. యోగాలో పాల్గొన్న అధికారులకు బ్రహ్మకుమారీస్ మెమెంటోలు అందజేశారు. వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం పి.అనురాధ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యోగా డే కార్యక్రమాలు జరిగాయి. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, డిప్యూటీ ఎంపీడీఓ భైరవమూర్తి, ఇతర సిబ్బంది యోగా డేలో పాల్గొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో అధికారులు, ఉద్యోగులు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అధ్యక్షత వహించారు.


యోగా డే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

శారీరక ఆరోగ్యానికి..

పెద్దాపురం: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా దోహదపడుతుందని ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. యోగా దినోత్సవంలో మాట్లాడుతూ, సమాజంలో ఒత్తిళ్ల నుంచి బయటకు వచ్చేందుకు యోగా దోహదపడుతుందన్నారు. యోగా గురువులను సత్కరించారు. పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో డైరెక్టర్, నిర్వాహకులు రాయవరపు వీరబాబు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాయవరపు సత్య అధ్యక్షత వహించారు. విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు యోగాసనాలు వేశారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి అధ్యక్షత యోగా డే జరిగింది. దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు.


శాంతివర్ధనలో యోగాసనాలు వేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

యోగాతో ఆరోగ్యకర జీవనం

కొత్తపల్లి: యోగా వల్ల ఆరోగ్యకర జీవనం సాధ్యమని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని సచివాలయాలు, కార్యాలయాలు, పాఠశాలల్లో యోగా డే నిర్వహించారు. ఎంపీడీఓ రవికుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా కళలకు సారథి యాసలపు


కళాకారుల శిక్షణను ప్రారంభిస్తున్న రాజా


కళారూపాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

పెద్దాపురం: సమాజానికి దిశా నిర్దేశం చూపే ప్రజా కళలకు సారథి లాంటి వ్యక్తి యాసలపు సూర్యారావు అని చంద్రమాంపల్లి స్నేహా ఆర్ట్ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు గొందేశి రాజా అన్నారు. కార్మిక నేత యాసలపు సూర్యారావు వర్ధంతి సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని సూర్యారావు భవనం వద్ద శనివారం రొంగల వీర్రాజు అధ్యక్షతన కళాకారుల శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ, జానపద కళారూపాల పరిరక్షణ కోసం, ప్రజా సమస్యలపై కళాకారులను తయారు చేయడంలో సూర్యారావు ముందుండేవారన్నారు. కొత్త కళారూపాలను తయారు చేయడానికి కృషి చేస్తున్న ప్రజా నాట్య మండలిని అభినందించారు. పార్టీలకతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సూర్యారావు చూపిన చొరవ మరువలేనిదని కొనియాడారు. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ, యువతలో స్ఫూర్తి రగిల్చిన నాయకుడు సూర్యారావు అన్నారు. తొలుత సూర్యారావు చిత్రపటానికి పూలమాలల వేసి, నివాళులర్పించారు. అనంతరం పలు జానపద కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రూరల్ శాఖ కార్యదర్శి కేదారి నాగు, పీఎస్ఎం మండల అధ్యక్షులు మంతెన సత్తిబాబు, దారపురెడ్డి సత్యన్నారాయణ, కృష్ణ, మాగాపు నాగు తదితరులు పాల్గొన్నారు.